విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 16, ఫిబ్రవరి 2024

నేడు దేశవ్యాప్త గ్రామీణ బంద్‌కు సీపీఐ సంపూర్ణ మద్దతు

- సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్...

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్ : రైతులు కార్మికుల పొట్టలు కొడుతూ వారి కష్టాన్ని కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి గుణపాఠం నేర్పాల్సిన సమయం ఆసన్నమైందని సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ నీలం రాజశేఖర్ రెడ్డి భవనంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతులు కార్మికులు తమకు జరిగిన అన్యాయంపై పాలక ప్రభుత్వాలను ప్రశ్నిస్తుంటే వారిపై భద్రతా దళాలను రెచ్చగొట్టి అమానుష దాడులకు పాల్పడడం పాలు చూపించి విషం చిమ్మిన చందంగా ఉందని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు కార్మికుల పట్ల సానుకూలంగా స్పందించక పోవడంతో ఛలో ఢిల్లీ కార్యక్రమానికి బయల్దేరిన బాధితులను సరిహద్దుల్లోనే నిలిపి హింసాకాండను ప్రేరేపించడం బీజేపీ నిరంకుశ పాలనకు నిదర్శనమని విరుచుకు పడ్డారు. అన్ని వర్గాల ప్రజలను కాపాడాల్సిన రక్షక భటులు పాలకుల తాయిలాలకు తలొగ్గి భక్షక భటులుగా మారారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ హయాంలో ఇప్పటికే అనేక మార్లు జరిగిందని గతంలో సంవత్సరం పాటు జరిగిన నల్ల చట్టాల ఉద్యమమే ఇందుకు నిదర్శనమని చెప్పుకొచ్చారు. ఆనాడు జరిగిన రైతు ఉద్యమం ప్రధాని మోదీ గుర్తు చేసుకోవాలని సూచించారు. దేశంలో వ్యవసాయ రంగంతో పాటు పరిశ్రమలు, గనులు, విద్యుత్, ఆటవి సంపద, రవాణా, బ్యాంకులు, ఎల్ఐసి తదితర ఆదాయ వనరులు అంబానీ అదానీలకు కట్టబెట్టే విధానాల వల్ల ఆదానీ అంబానీలు ప్రపంచ కుబేరుల జాబితాలో చేరారని పేద రైతులు, కౌలు రైతులు వ్యవసాయ కార్మికులు 1 లక్షా 50 వేల మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని బిజెపి ప్రభుత్వం పై దుమ్మెత్తి పోశారు. ఆంధ్ర రాష్ట్రానికి ద్రోహం చేసి ప్రత్యేక హెూదాను నిరాకరించిన మోదీ ప్రభుత్వంపై మండిపడ్డారు. డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేస్తూ అన్ని పంటలకు మద్దతు ధర, రైతురుణ మాఫీ, కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టం ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్లో 2 లక్షల కోట్ల కేటాయించి 2 వందల పనిదినాలతోపాటు రోజు వారీ వేతనం రూ.600లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆహార భద్రత చట్టం తీసుకు రావాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు స్వస్తి పలికి కడప ఉక్కుపరిశ్రమను నిర్మించి ఆదుకోవాలన్నారు. రాష్ట్ర హక్కులను హరించి ఈమతోన్మాదాన్ని పెంచి పోషిస్తుందని మోదీ పై విరుచుకుపడ్డారు. అన్నదాతలు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు కనీస మద్దతు ధరకు భరోసానిచ్చే చట్టం అమలులోకి తీసుకు రావాలని డిమాండ్ చేశారు. అనంతరం ఫిబ్రవరి 16న దేశవ్యాప్త గ్రామీణ బందును పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్. శ్రీరాములు, సంతోష్ కుమార్, నాగరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి, సిపిఐ నగర సహాయ కార్యదర్శి అల్లీపీరా, మిడిల్ క్లాస్ యూనియన్ చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ డ్రైవర్లకు అవార్డులు

విశాలాంధ్ర-ఉరవకొండ: విధి నిర్వహణలో ఎలాంటి ప్రమాదాలుకు తావివ్వకుండా బాధ్యతాయుతంగా విధులను నిర్వహించిన ఉరవకొండ ఆర్టీసీ డిపోకి చెందిన డ్రైవర్లు బివిఎల్. నారాయణ, శివప్రసాద్, గంగన్నలకు ఉత్తమ డ్రైవర్లుగా ఎంపిక కావడంతో వారికి ప్రశంసా పత్రాలను, అవార్డులను అందించారు. బుధవారం అనంతపురం ఆర్టిసి డిపో ప్రాంగణంలో జరిగిన రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా అదనపు ఎస్పీ విజయ్ భాస్కర్ రెడ్డి, ఆర్టీవో సురేష్ నాయుడు, ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆదోని ఉత్తమ డ్రైవర్లకు ప్రశంసా పత్రాలను అవార్డులను అందజేశారు.

సీపీఐ శాఖ కమిటీ ఏర్పాటు..

విశాలాంధ్ర-కూడేరు : మండలంలోని ముద్దులాపురంలో బుధవారం సీపీఐ శాఖ కమిటీని పార్టీ మండల కార్యదర్శి నారాయణమ్మ, జిల్లా కమిటీ సభ్యులు రమణ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఐ గ్రామశాఖ కార్యదర్శిగా చింతకాయల రామాంజనేయులు, సహాయ కార్యదర్శులుగా ఎర్రప్ప వరలక్ష్మి, కమిటీ సభ్యులుగా లక్ష్మమ్మ, లక్ష్మీదేవి, చంద్రకళ, ఓబులేసు, రాజకుమార్, పెద్దఓబులేసు, బొం బాయి ఓబులేసు, నాగార్జున, కావేరి, ముత్యాలక్క ,ఓబులమ్మ, అశ్విని, రూపను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎన్నికల్లో లబ్ధి కోసమే టిడ్కో గృహాల ప్రారంభించారు..

మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

విశాలాంధ్ర-తాడిపత్రి: ఎన్నికల వేల ఎన్నికల లబ్ధి కోసమేనా టిడ్కో గృహాల ప్రారంభించారని సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ ప్రభుత్వాన్ని విమర్శించారు. గురువారం పట్టణంలోని నెహ్రూ పార్క్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు టిట్కో గృహాలు పుట్లూరు రోడ్డు, ఆర్డిటి కాలనీ వద్ద ప్రారంభించి దాదాపు 90 శాతం పూర్తయిన గృహాలను 10% పూర్తిచేసి ఎలక్షన్లు వస్తున్న వేల గృహాలు ప్రారంభం చేయడం ఎంత వరకు సమంజసం అన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారం వచ్చిన వెంటనే గృహాలకు మౌలిక వసతులు కల్పించి ప్రారంభించి ఉంటే పేద వారు బాగుపడేవారన్నారు. ఎమ్మెల్యే టిట్కో గృహాలకు రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యం తదితర మౌలిక వసతులు కల్పించక పోయిన వెళ్లి టిడ్కో గృహాలను ప్రారంభించడం ఎలక్షన్లలో లబ్ధి కోసమే అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పట్టణ సీపీఐ సహాయ కార్యదర్శి శ్రీరా ములు, రజక వృత్తిదారుల సమైక్య సంఘం పట్టణ కార్యదర్శి సాల వేముల సూరి ఏఐటియుసి నాయకులు రమణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముద్ర రుణాల మంజూరుకు అంగీకారం

విశాలాంధ్ర-యాడికి: స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో జాతీయ చేనేత ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ మమిళ్ళ నారాయణ స్వామి అధ్యక్షతన జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ నిలూరు రుసింగప్ప జాతి చేనేత ఐక్యవేదిక తాలూకా ప్రధాన కార్యదర్శి వేల్పుల మల్లికార్జున, యాడికి మండల కన్వీనర్ కోదండ చేనేత కార్మికులతో సమావేశం గురువారం నిర్వహించారు. చేనేత జౌళిశాఖ అధికారులు ప్రతిపాదించిన రుణాలు ఇవ్వాలని, 183 మంది చేనేత కార్మికులకు పది రోజులు గడువులోపు చేనేత ముద్ర రుణాలు మంజూరు చేయాలని, గతంలో రుణాలు చెల్లించిన వారికి తిరిగి రుణాలు ఇవ్వాలని బ్యాంకు మేనేజర్‌మధుసూదన్ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. 183 మంది చేనేత కార్మికులకు సిబిల్ స్కోర్ ఆధారంగా రుణాలు మంజూరు చేస్తామని హామీఇచ్చారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు లక్ష్మీ నారాయణ, రామాంజనేయులు, రంగస్వామి, హాజి పీర పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరు

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్: శ్రీరామరెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాడుతామని, అండగా ఉంటామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఆ పార్టీ నాయకులతో కలిసి కార్మికుల పక్షాన ధర్నా నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై కార్మికుల కడుపు కొడితే సహించేది లేదని, హక్కుల కోసం నిరసన తెలియజేస్తే వైసీపీ నాయకుల దౌర్జన్యానికి దిగడం సమంజసం కాదన్నారు. పోలీసులు కూడా అధికార పార్టీనాయకులకు కొమ్ము కాయడం న్యాయమా అని ప్రశ్నించారు. నాయకులు దొడగట్ట, నారాయణ తలారి సత్తప్ప పాల్గొన్నారు.

ఓటర్ నమోదుకు ఆధారాలు చూపాలి

విశాలాంధ్ర-ఉరవకొండ: కొత్త ఓటర్లు నమోదుకు సరైన ఆధారాలను చూపాల్సిన అవసరం ఉందని, ఆధారాలు చూపకపోవడం వల్లే దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయని ఉరవకొండ నియోజకవర్గం అసిస్టెంట్ ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి శిరీష అన్నారు. గురువారం తాహసీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన సీపీఎం, టిడిపి, కాంగ్రెస్, బీఎస్పీ, తదితర పార్టీలకు చెందిన రాజకీయ పార్టీల నాయకులతో ఆమె సమావేశాన్ని నిర్వహించారు. కొన్ని రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ ఇప్పటికీ ఓటర్ల జాబితాలో డబుల్ ఓటర్లు, చనిపోయిన వారి ఓటర్లు కూడా నమోదు అయి ఉన్నాయని వాటిని తొలగించాలని గత సమావేశంలోనే మీ దృష్టికి తీసుకొచ్చామని వాటిని ఇంకా తొలగించ లేదని తెలిపారు. అనంతరం ఈఆర్ఓ మాట్లాడుతూ గతంలో తామే తొలిగించే వాళ్ళమని జనవరి 22 తర్వాత కలెక్టర్ అప్రూవల్‌తో తొలగించాల్సి ఉందన్నారు. ఇప్పటికే 2 వేల దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని, ఎన్నికల కమిషన్ ఆదేశాలు మేరకే చర్యలు తీసుకుంటామని సహకరించాలని కోరారు.

ఫిట్‌నెస్ లేని ఏవిఆర్ పాఠశాల బస్సులను సీజ్ చేయాలి

ఆర్టీవో కార్యాలయం ముందు విద్యార్థి సంఘాల ఆందోళన

ఆర్టీవోకు వినతి పత్రం అందిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ పట్టణంలో ఏవిఆర్ ప్రైవేట్ స్కూల్ బస్సు సరిగా కండిషన్ లేక డ్రైవర్లకు లైసెన్సులు కూడా లేకపోవడం వల్ల బుధవారం విద్యార్థులతో వస్తున్న బస్సు ప్రమాదానికి గురైందని కండిషన్ లేని బస్సులను తక్షణమే సీజ్ చేయాలని కోరుతూ గుంతకల్లు ఆర్టిఓ కార్యాలయం ముందు ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన నిర్వహించారు. ప్రమాదం జరిగిన తర్వాత అధికారులు తూతూ మంత్రంగా పరిశీలించి నామమాత్రంగా జరిమానా విధించారని దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. జరిగిన ప్రమాదంలో విద్యార్థులకు ఏమైనా జరిగి ఉంటే ఎవరు బాధ్యత వహిస్తారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించాలని కండిషన్ లేని బస్సులను సీజ్ చేసి పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్టీవోకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో ఆలిండియా ఎస్సీ ఎస్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు, ఎస్సీ ఎస్టీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు రాజశేఖర్, ఎస్సీ ఎస్టీ సత్యసాయి జిల్లా మద్దెలచెరువు వెంకీ, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఉరవకొండ మండలాధ్యక్షులు హరూన్ రషీద్, బిఎస్ఎఫ్ మండల అధ్యక్షులు రాము, సింహాద్రి నాయక్, బిఎస్ఎఫ్ ఉరవకొండ కార్యదర్శి మురళి, ఎస్సీ ఎస్టీ నాయకులు నల్లబోతుల మళ్ళీ, లోక్నాథ్ పాల్గొన్నారు.

సేవామూర్తులు వాలంటీర్లు.. జేసీ

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: గుంటూరు జిల్లా ఫిరంగిపురం నుంచి గురు వారం వరుసగా 4వ ఏడాది వాలంటీర్లకు అభినందన కింద ఉత్తమ గ్రామ, వార్డు సచివాలయ వాలంటీర్లకు సేవా మిత్రా, సేవారత్న, సేవా వజ్ర అవార్డులను ప్రధానం చేసే కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో నిర్వహించిన వాలంటీర్లకు అభినందన జిల్లా స్థాయి కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, జేసీ కేతన్ గార్గ్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్ పర్సన్ నదీమ్ అహ్మద్, ఆర్టీసీ జోనల్ చైర్ పర్సన్ మంజుల, ఎడిసిసి బ్యాంక్ చైర్ పర్సన్ లిఖిత, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, ఏపీ అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ టి.లక్ష్మి, డీఎల్డిఓలు ఓబులమ్మ, శంకర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఆలమూరు సుబ్బారెడ్డి, గ్రామ, వార్డు సచివాలయ వాలంటీర్లు పాల్గొన్నారు. జెడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ వాలంటీర్లు సేవామూర్తులని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సైనికులుగా పురస్కారాలు అందుకుంటున్న వాలంటీర్లకు అభినందనలు తెలిపారు.

ఆదర్శ పురుషుడు సంత్ శ్రీ సేవలాల్ ..

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: బంజారాల ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవలాల్ మహారాజ్ అందరికీ ఆదర్శ పురుషుడని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. గురు వారం అనంతపురం కలెక్టర్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఏపీ ప్రభుత్వం వారి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి మహెూత్సవాల సందర్భంగా సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. జేసీ మాట్లాడుతూ సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 1739 ఫిబ్రవరి 15వ తేదీన జిల్లాలోని రాంజీ నాయక్ తండాలో జన్మించారన్నారు. సేవాలాల్ మహారాజ్ జగదాంబ మాతనే తన మార్గదర్శకరాలిగా, గురువుగా స్వీకరించి అన్ని విద్యలను నేర్చుకుని బంజారాల సేవలో నిమగ్నమయ్యాడన్నారు.

నగరానికి ఎన్ని నిధులు తెచ్చావు..?

ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి ధ్వజం : నేటి నుంచి ప్రజల్లోకి..

విశాలాంధ్ర- అనంతపురం రూరల్: నగర అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి ఎన్ని నిధులు తెచ్చావో చెప్పాలని.. కార్పొరేషన్ నిధులతో నాలుగు రోడ్లు వేస్తే అది అభివృద్ధి కాదని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డిపై ప్రశ్నించారు. గురువారం ఆయన నగరంలో పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నగరంలో ప్రజలు 20 రోజులుగా తీవ్రమైన నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నా... పట్టదా అన్నారు. మరువ కొమ్మ మురికి కాలువ ఆధునీకరణకు రూ.18.50 కోట్ల నిధులు విడుదల చేయించి కాంట్రాక్టర్ కు పనులు అప్పగిస్తే, వైసీపీ అధికారంలోకి రాగానే కాంట్రాక్టర్లను బెదిరించి టెండర్లు రద్దుచేసి మరొక కాంట్రాక్టర్‌తో పని ప్రారంభించారన్నారు. కమీషన్లకు కక్కుర్తి పడి కేవలం మూడు చోట్ల కల్వర్టులు నిర్మించడం అన్యాయమని, లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. ఇందుకోసం గురువారం దీక్షకు అవకాశం ఇవ్వమని పోలీసులను అనుమతి అడిగితే ఇవ్వలేదన్నారు. అదే ఎమ్మెల్యే రోడ్లపైన ఎక్కడ సభలైనా పెట్టుకోవచ్చని, మేము పర్మిషన్లు అడిగితే ఇవ్వడం లేదన్నారు. నేటి నుంచే ఇంటింటికి తిరిగి వివరిస్తామన్నారు. నగరంలో ఏదైనా అభివృద్ధి జరిగిందంటే గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని, రూ.91 కోట్లతో 11 రిజర్వాయర్ల నిర్మాణం చేసి రెండు దశాబ్దాల వరకు నగరానికి నీటి సమస్య లేకుండా చేశామని, చిన్నపాటి మోటార్లు చెడిపోతే 20 రోజులుగా రిపేరు చేయించలేదన్నారు.

ఏఐఎస్ఎఫ్ అనంతపురం కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: అఖిల భారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్ఎఫ్) అనంతపురం నగర సమితి సమావేశం ఉమామహేష్ అధ్యక్షతన స్థానిక నీలం రాజశేఖర్ రెడ్డి భవనంలో నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన నగర సమితి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా మంజునాథ్, ఉమా మహేష్, నగర ఉపాధ్యక్షుడు వంశీ, అశోక్, హరికృష్ణ, నగర సహాయ కార్యదర్శిలు రారాజు, విశ్వనాథ్, ఆనంద్, హర్ష, 19 కార్యవర్గం, 27 కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమణయ్య, కుల్లాయి స్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహ యాదవ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నూతన నగర అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ నగరంలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కారం కోసం పోరాడుతామని తెలిపారు. కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా ముందస్తు అడ్మిషన్లకు వ్యతిరేకంగా పోరాడుతామని తెలుపుతూ మా ఎన్నికకు సహకరించిన ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆసరాతో అక్కాచెల్లెమ్మలకు భరోసా..

విశాలాంధ్ర-శింగనమల: మహిళలు ఆర్థికంగా స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన నాడే అన్ని రంగాల్లో ముందంజ వేయగలుగుతారని, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మహిళా సాధికారతకు పెద్ద పీట వేశారని ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబ శివారెడ్డి నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు అన్నారు, శింగనమల మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం "వై.యస్.ఆర్ ఆసరా" నాలుగవ విడత లబ్ధి కార్యక్రమాన్ని సాంబశివారెడ్డి నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు ప్రారంభించారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు, ఎక్కడ మహిళలు సంతోషంగా ఉంటారో అక్కడ దేవతల ఆశీర్వాదం ఉంటుందని పెద్దలు చెబుతుంటారని, గతంలో వైయస్సార్, ప్రస్తుతం జగనన్న ముఖ్యమంత్రి కావడానికి అక్కచెల్లెమ్మలే కారణమన్నారు, గత టీడీపీ ప్రభుత్వ హయంలో చంద్రబాబు నాయుడు డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చాక మొండి చేయి చూపారన్నారు. జగనన్న అధికారంలోకి వచ్చాక దశల వారీగా నాలుగు విడతల్లో రుణమాఫీ చేశారని తెలిపారు.

ఐఓటితో విప్లవవాత్మక మార్పు

వీసి శ్రీనివాసరావు..

విశాలాంధ్ర-జెఎన్‌టియుఏ: ఐఓటితో విప్లవత్మక మార్పులు రానున్నాయని జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.వి.యస్. శ్రీనివాస రావు పేర్కొన్నారు. గురువారం జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల ఇ.సి.ఈ. విభాగంలో ఐఓటి హేక్టన్ అంశంపై మూడు రోజులు పాటు విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. వీసి మాట్లాడుతూ.. వ్యవసాయ, వైద్య, పారిశ్రామిక, హెూటల్ తదితర రంగంలో ప్రగతికి ఐఓటీ తోడ్పాటును అందిస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్వి సత్యనారాయణ మాట్లాడుతూ.. సమాజంలో ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు పరిష్కార మార్గాలను చూపగలిగే విధంగా విద్యార్థుల ఆలోచన, మేధ సంపదకు సాంకేతిక తోడైతే విజయ శిఖరాలను అధిరోహించగలరన్నారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ డి.విష్ణు వర్ధన్, కన్వీనర్‌గా హెచ్.ఓ.డి. డాక్టర్ జి.మమత, ఆచార్య రమణారెడ్డి, డా.లలిత కుమారి, డా.అరుణ మస్తాని మాజీ ఆచార్యులు గిరిప్రసాద్, గిరిధర్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి దళిత గర్జన జయప్రదం చేయండి

విశాలాంధ్ర-బొమ్మనహాల్: రాయదుర్గం పట్టణంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో దళిత గర్జన సభను బొమ్మనహాల్ మండలంలో టీడీపీకి చెందిన దళితశ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండాపురం కేశవరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు కొత్తపల్లి మల్లికార్జున కోరారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ దళితలను ఓటు బ్యాంకుగా వాడుకొని సీఎం జగన్మోహన్‌రెడ్డి మోసగించారని ఆరోపించారు.

భారత్ బంద్‌ను జయప్రదం చేయండి : సీపీఐ నాయకుల పిలుపు

ఉరవకొండలో మాట్లాడుతున్న నాయకులు

విశాలాంధ్ర-ఉరవకొండ: నేడు జరిగే దేశవ్యాప్త గ్రామీణ బందును విజయవంతం చేయాలని సీపీఐ పార్టీ ఉరవకొండ నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున, వజ్రకరూరు మండలం కార్యదర్శి సుల్తాన్, ఉరవకొండ సీపీఐ కార్యదర్శి తలారి మల్లికార్జున పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్రం లో పరిపాలిస్తున్న బిజెపి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా గ్రామీణ బారత్ బందు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నాలుగు కోడ్ చట్టాలు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని. కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా అవుట్ సోర్సింగ్, స్కీం వర్కర్లను గుర్తించాలని కోరారు.

నల్ల చట్టాలపై యుద్ధభేరి మోగిద్దాం..

అనంతపురంలో మాట్లాడుతున్న నాయకులు

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్ : కేంద్ర ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి వచ్చాక రైతు నల్ల చట్టాలను, 44 చట్టాలను లేబర్ కోడ్స్‌గా తీసుకువచ్చిందని రాజారెడ్డి ఆరోపించారు. గురువారం స్థానిక తడకలేరులో గుత్తి రూట్ ఆటో డ్రైవర్ల సమావేశం నిర్వహించారు. ఏఐటీ యూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి హాజరై మాట్లాడుతూ రైతు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తక్షణమే స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేయాలని, రైతులకు రుణమాఫీ, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, పోలవరం ప్రాజెక్టు వీటన్నింటినీ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.. డ్రైవర్లకు ఉరితీసే చట్టాలను రద్దుచేసి, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. నేటి సమ్మెలో మున్సిపల్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున కార్మికులు, ఆటో డ్రైవర్లు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, సాయి, నాగేంద్ర, సురేష్‌బాబు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి..

ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున

విశాలాంధ్ర-రాప్తాడు: దేశవ్యాప్త గ్రామీణ బంద్, పారిశ్రా మిక సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున ఒక ప్రకటన కోరారు. పీఎం నరేంద్ర మోడీ హామీని అమలుపరిచి రైతాం గాన్ని ఆదుకోవాలని, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. మార్కెట్ సహకారం లేక పెట్టు బడులు కూడా తిరిగి రావడం లేదని, దీంతో రుణభారం ఎక్కువై ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. డాక్టర్ స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలన్నారు. హామీ పథకానికి రూ.2 లక్షల కోట్లు కేటాయించి రోజువారీ కూలికి రూ.600కు పెంచాలన్నారు. కార్మికులకు కనీస వేతనము రూ.30 వేలు ఇవ్వాలన్నారు. కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌గా విభజించడం వల్ల కార్మిక హక్కులకు భంగం వాటిల్లుతుందన్నారు. అందుకు వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

బంద్‌కు వేలాదిగా తరలిరండి..

విశాలాంధ్ర- పుట్లూరు: కేంద్ర మోడీ ప్రభుత్వ రైతాంగ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగే కార్మికుల సమ్మె గ్రామీణ బందులో వేలాదిగా పాల్గొనా లని సీపీఎం, వ్య.కా.సం నాయకులు కోరారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరచకుండా మోసగిస్తున్నదని, వ్యవసాయ పరిశ్ర మలు గనులు విద్యుత్ అటవీ సంపదలను రవాణా బ్యాంకులు ఎల్ఐసి తదితర సంస్థల స్నీటిని ఆదానీ అంబానీ తదితర కార్పొరేట్ కంపెనీలకు అప్పజెపుతోందని, కార్పొరేట్ కంపెనీల లాభాలకు ఆటంకంగా ఉన్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కార్మిక కోడ్లు తెచ్చిందని ధ్వజమెత్తారు. కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు ఇవ్వడంతో మోజు ఎక్కువైందన్నారు. సీపీఎం పుట్లూరు మండల కార్యదర్శి ఎస్.సూరి, ఏపీ రైతు సంఘం కార్యదర్శి వెంకట చౌదరి, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పెద్దయ్య, కెవిపిఎస్ కార్యదర్శి నాగభూషణ్, రైతు నాయకుడు భాస్కర్ రెడ్డి, రాము పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

విశాలాంధ్ర-ధర్మవరం: దేశ వ్యాప్తంగా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలకు సంబంధించిన చట్టాన్ని ఏర్పాటు చేయాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసు అమలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సమితి, జిల్లా ప్రధాన కార్యదర్శి జేవీ. రమణ పేర్కొన్నారు. గురువారం మాట్లాడుతూ గతంలో చేసిన ఆందోళన కార్యక్రమాల్లో ఆందోళనకారులపైన పెట్టిన కేసులను కొట్టివేయలని, రైతులకు బ్యాంకుల్లో ఉన్న రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అణగదొక్కే ప్రయత్నాలు మానుకోకపోతే బుద్ధి చెబుతామని హెచ్చరించారు. మూడు నల్ల చట్టాలను పూర్తిగా రద్దు చేయాలని, యుద్ధప్రాతిపదికన రైతు సంఘాలతో చర్చలు జరిపి హామీలను నిలబెట్టుకుకోవాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడలు రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కరువు తుఫాను వల్ల నష్టపోయిన రైతాంగానికి పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్ వారి ఖాతాల్లో జమ చేయాలన్నారు. 50 ఏళ్ల ప్రతి రైతుకు రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. శుక్రవారం తలపెట్టిన భారత్ గ్రామీణ బంద్ జయప్రదం కోసం రైతులు, కార్మికులంతా కలసి రావాలని పిలుపునిచ్చారు.

గ్రామీణ కార్మిక బంద్‌ను జయప్రదం చేద్దాం

▶ సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్

విశాలాంధ్ర-కదిరి: శుక్రవారం జరగనున్న దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.వేమయ్య యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం సీపీఐ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హెూదాను నిరాకరించిన మోదీ ప్రభుత్వంపై ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేస్తూ అన్ని పంటలకు మద్దతు ధర, రైతురుణ మాఫీ, కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టం ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్లో 2 లక్షల కోట్ల కేటాయించి 200 పని దినాలతో పాటు రోజు వారీ వేతనం రూ.600లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆహార భద్రత చట్టం తేవాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు స్వస్తి పలికి కడప ఉక్కు పరిశ్రమను నిర్మించాలన్నారు. రాష్ట్ర హక్కులను హరించి మతోన్మాదాన్ని పెంచి పోషిస్తుందని మోదీపై విరుచుకు పడ్డారు. పండించిన పంటలకు కనీస మద్దతు ధరకు భరోసా నిచ్చే చట్టం అమలు చేయాలని కోరారు. బంద్‌లో రైతు సంఘాలు, కార్మిక సంఘాలు, అసోసియేషన్లు, ఫెడరేషన్లు, వినియోగదారుల సంఘాలు, వృత్తి సంఘాలు, విద్యార్థి, యువజన, మహిళ సాంస్కృతిక సంఘాలు సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆసరా చెక్కుల పంపిణీ..

విశాలాంధ్ర-ముదిగుబ్బ: వైయస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రాంరెడ్డి మహిళా సంఘాల సభ్యులకు పంపిణీ చేశారు. కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అక్కాచెల్లెమ్మలు ఆర్థికంగా బలోపేతం ఉన్నత స్థాయికి ఎదగాలన్న ఆశయంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మహిళా సంఘాల సభ్యులకు ఆసరా నిధులను విడుదల చేశారని కొనియాడారు. గురువారం స్థానిక సొసైటీ బ్యాంకు సమీపంలో వైయస్సార్ ఆసరా నాలుగో విడత పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు, 1043 మహిళా సంఘాలకు 11,473 డ్వాక్రామహిళలకు 10,79,32,145 మెగా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి ఇందు కూరు నారాయణరెడ్డి, మండల కన్వీనర్ సివి నారాయణరెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవి చెంద్రాయుడు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లను త్వరలో పంపిణీ చేస్తాం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి.

విశాలాంధ్ర-ధర్మవరం: ప్రభుత్వంచే నిర్మించిన టిడ్కో ఇళ్లను అతి త్వరలో లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం పట్టణంలోని టీడ్కో ఇళ్ల నిర్మాణాన్ని స్వయంగా పరిశీలించారు. మొత్తం 1450 ఇళు ఎంతవరకు పూర్తయ్యాయి,.. పెండింగ్ ఎంత ఉంది..? రోడ్డు, తాగునీరు, విద్యుత్ వ్యవస్థ, తదితర సౌకర్యాలపై టిట్కో డీఈ, ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టులను అడిగి తెలుసుకున్నారు. మరో 20 రోజులలోపల పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేలా అధికారులు వేగవంతంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామ్కుమార్,మున్సిపల్ ఇంజనీరింగ్ అధికా రులు, కాంట్రాక్టర్లు, టీటీకో ఏజెన్సీదారులు, వార్డు కౌన్సిలర్లు, మాజీ వైస్ చైర్మన్ మాసపల్లి సాయికుమార్, చందమూరి నారాయణ రెడ్డి, పెనుజూరు నాగరాజు, కౌన్సిలర్లు గోరకాటి పురుషోత్తంరెడ్డి మేడా పురం వెంకటేశుతో పాటు బాల్రెడ్డి పాల్గొన్నారు.

షిరిడీ బాబా గుడిలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని పుట్టపర్తి రోడ్డు సాయి నగర్‌లో గల శ్రీ షిరిడీ సాయిబాబా దేవాలయంలో గురువారం కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాబా సంకీర్తనలతో ఆలయం మారుమోగింది. బాబా విగ్రహానికి వివిధ పూలమాలలతో అలంకరించిన వైనం భక్తాదులను విశేషంగా ఆకట్టుకుంది.అధ్యక్షులు సూర్య ప్రకాష్ మాట్లాడుతూ ప్రతి గురువారం ప్రత్యేక పూజలతో పాటు, ప్రతిరోజు అన్నదాన కార్యక్రమాలు, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తూ, దత్త జయంతి శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. దాతల సహకారాలతో ఆలయ అభివృద్ధి కూడా చేపట్టడం జరిగిందని వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

మట్టి అక్రమ రవాణాను అడ్డుకున్న సీపీఐ నాయకులు..

విశాలాంధ్ర-హిందూపురం : హిందూపూరం రూరల్ పరిధి లోని కోటిపి వద్ద, ఇండస్ట్రియల్ ఏరియాకు అనుకొని ఉన్న భూము ల్లో అక్రమంగా మట్టి తోలుతున్న జెసిబి, టిప్పర్లను గురువారం సిపిఐ నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సిపిఐ హిందూపురం పట్టణ కార్యదర్శి కనిశెట్టిపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ, మట్టి తోలుతున్న వారిని అనుమతులు ఉన్నాయా అని అడగగా, సమాధానం లేకుండా పారిపోయారన్నారు. గోలపురం పారిశ్రామిక వాడకు కూతవేటు దూరంలో ఉన్న కోటీపి పొలంలో అనుమతులు లేకుండా దాదాపు మూడు నెలలుగా కొందరు మట్టిని ఆంధ్ర సరిహద్దులోని కర్ణాటక పారిశ్రామికవాడలో వేస్తున్న రోడ్లకు తరలిస్తున్నారన్నారు. ఈ విషయంపై పలుమార్లు పలు పత్రికల్లో వార్తా కథనాలు కూడా వచ్చినా అధికారుల్లో చలనం లేదన్నారు. గుంతలను పూడ్చడానికి స్టీల్ పరిశ్రమల్లోని ఐరన్ మిశ్రమాలతో కూడిన వ్యర్థాలను పెద్దఎత్తున ఉపయోగిస్తున్నారని, ఈ ప్రాంతం ఎత్తులో ఉండటం వల్ల రాబోవు రోజుల్లో వర్షాకాలంలో ఈ వ్యర్థాలు లోతట్టు ప్రాంతమైన కొటిపి చెరువులోకి నీటి ప్రవాహం ద్వారా చేరుకునే అవకాశం ఉందని, తద్వారా భూగర్భజలాలు కలుషితమై గ్రామ ప్రజలు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ యంత్రాలు టిప్పర్లు ఖాళీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తుమకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం అధ్యక్షులు రవికుమార్, సిపిఐ నాయకులు మారుతి రెడ్డి, లక్ష్మీనారాయణ, మురళి, మల్లికార్జున అడ్డుకున్నారు.

ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

నల్లబ్యాడ్జీలతో నేషనల్ మజ్దూర్ నాయకుల నిరసన

నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

విశాలాంధ్ర-కదిరి: ఏపీ ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఏపీఎస్జీవో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డిపో కార్యాలయం వద్ద నేషనల్ మజ్దూర్ అసోసియేషన్ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు హరి మోహన్,ఎన్వి రమణ మాట్లాడుతూ ప్రభుత్వంలో విలీనం కాబడిన ఆర్టీసీ ఉద్యోగులకు 2020 సంవత్సరం నుండి 2023 వరకు దాదాపు నాలుగు సంవత్సరాల లీవ్ ఎంగేజ్మెంట్ బాకీ ఉన్నదని రూ.7 కోట్లు బకాయిలు, కరువు బత్యం బకాయిలు, సెటిల్మెంట్ బకాయిలు, ఇన్సూరెన్స్ బకాయిలు ఇవ్వాలని, కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలని, నూతన బస్సులు కొనుగోలు చేయాలని కోరారు. ప్రభుత్వంలో విలీనమైన తర్వాత ఏపీఎస్ ఉద్యోగులకు అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వము వెంటనే ఈ సమస్యలకు పరిష్కారం చూపించి ఉద్యోగులకు న్యాయంగా రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో మజ్దూర్ అసోసియేషన్ డిపో కార్యదర్శి బైరిశెట్టి జిల్లా అధ్యక్షుడు అశ్వత్తమయ్య, ఓబులేసు, నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, హనుమంత రెడ్డి, సోమిరెడ్డి, రామ్మోహన్, మల్లికార్జున, గంగన్న, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పర్వం.. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మ రథోత్సవం..

విశాలాంధ్ర-రొళ్ల: మండల పరిధిలోని చారిత్రాత్మక ప్రదేశమైన రత్నగిరి గ్రామంలో గురువారం నేత్రపర్వంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. వేకువజామున వేద పండితులు శ్రీవల్లి దేవసేన సమేతంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. స్వామివారికి వెండి బంగారు ఆభరణాలతో పాటు పూలతో అలంకరణ చేసి మహా మంగళహారతి గావించారు. వేద పండితులు రథం ముందు బాగాన శాంతిహెూమం, దీక్ష హెూమం, బలి ప్రధానం చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాన్ని మేళ తాళాలతో ఆలయం నుంచి సమీపాన ఉన్న రథం వద్దకు తీసుకెళ్లారు. విగ్రహమూర్తులను రథంలో కూర్చోబెట్టి వందలాదిమంది భక్తుల నడుమ బ్రహ్మరథాన్ని దేవాలయం ప్రాంగణం నుంచి సమీపాన కోటవీధి వరకు రథాన్ని లాగారు. ఈ సందర్భంగా భక్తులు రథంపై పూలు పండ్లు తదితర వాటిని విసిరి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవాన్ని తిలకించడానికి గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన వారు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

మహిళలంతా స్వయం శక్తితో ఎదగాలి

మడకశిర నియోజకవర్గంలో నారా భువనేశ్వరికి నీరాజనం

బాధిత కుటుంబాలకు రూ.3 లక్షల చొప్పున చెక్కులు అందజేత

విశాలాంధ్ర-మడకశిర : రాష్ట్రంలో మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించి ఎన్టీఆర్ కలలుగన్న మహిళా సాధికారతను సాధించాలని నారా భువనేశ్వరి తెలిపారు. రానున్న ఎన్నికల కురుక్షేత్రంలో ఓటే ప్రజల ఆయుధమని ఈ ఆయుధంతో మీ భవిష్యత్తుకు బంగారు బాటగా మలుచుకోవాలని తెలుగుదేశం అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి అన్నారు. ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైపోతున్నాయని ప్రతి ఒక్కరు తమ ఓటును పరిశీలించుకోవాలని సూచించారు.వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించడం కోసం అందరూ ఓటుతో సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసినప్పుడు ప్రజలు చూపిన అభిమానాన్ని ఊపిరి ఉన్నంత వరకు మర్చిపోనని పేర్కొన్నారు, మడకశిర నియోజకవర్గంలోని గుడిబండ మండలం దిన్నెహట్టిలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త ముత్తప్ప కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించారు. నియోజకవర్గంలో రైతులు రైతుకూలి పని చేసే మహిళలతో భువనేశ్వరి నిర్వహించిన ముఖాముఖికి పెద్దఎత్తున స్పందన వచ్చింది.రాష్ట్ర తెదేపా ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి,మాజీ ఎమ్మెల్యే ఈరన్న ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు. రైతులుమహిళలు నియోజకవర్గంలో పరిశ్రమలు లేక ఏ విధంగా నష్టపోతున్నారో తనకు బాగా తెలునని చెప్పారు. మహిళలకు భువనేశ్వరి గుండె నిండా ధైర్యం నింపారు.చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుతో గుండెపోటుతో మృతి చెందిన నలుగురు టీడీపీ కార్యకర్తల కుటుంబాలను భువనేశ్వరి పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల ఆర్థిక సహాయం చెక్కును అందించారు. గురువారం గుడిబండ మండలం దిన్నెహట్టి గుండెపోటుతో మృతి చెందిన టీడీపీ కార్యకర్త ముత్తప్ప కుటుంబాన్ని పరామర్శించి చెక్కును అందజేశారు. పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్లో టీడీపీ ప్రభుత్వంలో భీమా మిత్రాలుగా విధులు నిర్వర్తించిన ఐదు మండలాలకు చెందిన లతా రాణి, పూర్ణిమ తదితరులతో కలిసి సిపిఐ ఇన్‌చార్జి ఆర్‌జి పవిత్ర బీమా మిత్రాల డిమాండ్ల వినతిపత్రాన్ని నారా భువనేశ్వరికు అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా అధ్యక్షుడు పార్థసారథి, రాష్ట్ర తెదేపా ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి పాల్గొన్నారు.

హిందూపురం ఎంపీ స్థానానికి పోటీకి సిద్ధం : పరిపూర్ణానంద స్వామి

విశాలాంధ్ర-పెనుకొండ: హిందూపురం పేరులోనే హిందూ ఉన్న దని అందుకోసమే హిందూపురం పార్లమెంటు అభ్యర్థిగా తను నిలబడుతున్నానని అందరూ ఆదరించాలని పరిపూర్ణానంద స్వామి పేర్కొన్నారు. పెనుకొండలో గురువారం తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ హిందూపురం అంటే హిందూ పదజాలంతో ఉందని అందుకు నేను హిందూపురం పార్లమెంటు ఎంచుకోవడం జరిగిందని బీజేపీ అధిష్టానికి హిందూపురం నుండి నిలబడుతున్నానని కోరడమైందని తెలిపారు. ముఖ్యంగా హిందూపురం పార్లమెంట్ అభ్యర్థిగా తన పేరు దాదాపు ఖరారు అయిందని ఇప్పటికే ప్రచారం కూడా మొదలు పెట్టామని తెలిపారు. రాజకీయాల్లోకి ముఖ్యంగా స్వామీజీలు రావడం హిందూ సాంప్రదాయాలను బలోపేతం చేయడానికే అన్నారు. హిందూపురం పార్ల మెంట్ స్థానంలో బీజేపీ గెలవడం చాలా ముఖ్యమని తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు

- స్పందన ఆసుపత్రి- డాక్టర్ సోనియా

విశాలాంధ్ర- ధర్మవరం: దేశ స్థాయిలో మహిళలు పురుషులతో పాటు అన్ని రంగాలలో రాణిస్తున్నారని స్పందన ఆసుపత్రి నిర్వాహకురాలు డాక్టర్ సోనియా తెలిపారు. జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మాట్లాడుతూ జననం, గమనం, సృష్టి, కర్త, కర్మవుగా మహిళ ఉంటుందని, రాజకీయాల సైతం కూడా మహిళలు ఉంటూ తమదైన శైలిలో మహిళా లోకానికి సేవలను అందిస్తున్నారని తెలిపారు. స్త్రీ సాధికారతతోనే దేశ పురోగతి ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా మహిళలు విద్య, వైద్య రంగాలలో రాణిస్తూ మంచి గుర్తింపు కూడా పొందడం సంతోషించదగ్గ విషయమని తెలిపారు. అమ్మలా లాలిస్తూ బిడ్డలకు, జీవితంలో తోడుగా భర్తకు, మంచి గుర్తింపుగా సమాజంలో మెలగడానికి నేటి మహిళలు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. నిరంతర చైతన్యము, పెరుగుతున్న సానుకూల దృక్పథం, అంకితభావం, పోరాట శక్తి వారిని మునుముందుకు నడిపిస్తున్నాయని తెలిపారు.

ఘనంగా సుబ్రహ్మణ్య షష్టి వేడుకలు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ఎస్ఎల్వీ మార్కెట్ పాత బస్టాండ్ వద్ద గల శ్రీ సుబ్రహ్మణ్య నాగ దేవతల కట్ట ఆలయంలో సుబ్రహ్మణ్య షష్టి వేడుకలు ప్రధాన అర్చకులు విజయ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే సుబ్రమణ్య నాగదేవతల ఉత్సవ విగ్రహాలను వివిధ అభిషేకాలతో పాటు పాలాబి.షేకమం నిర్వహించారు. వివిధ పూలమాలలతో అలంకరణ భక్తాదులను విశేషంగా ఆకట్టుకుంది. దాత చేతుల మీదుగా వెండి కవచ సమర్పణ నిర్వహించారు. సుబ్రహ్మణ్య షష్టి పూజలు నిర్వహించడం వల్ల మనిషికి చక్కటి ప్రశాంత, కుటుంబంలో కష్టాలు తొలగి సుఖ వంతమైన జీవితాన్ని గడుపుతారని అర్చకులు తెలిపారు.

నేడు రథసప్తమి వేడుకలు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో శుక్రవారం రథసప్తమి మహెూత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, రథోత్సవ కమిటీ చైర్మన్ దాశెట్టి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు కుండా చౌదయ్య, ఆలయ ఈవో వెంకటేశులు పేర్కొన్నారు. గురువారం వారు మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి హాజరవుతున్నారని, దాతల సహాయ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మెూత్సవాల తరహా ఒకే రోజున సూర్యప్రభ, శేష, గరుడ, హనుమ, కల్ప వృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలలో స్వామివారు పట్టణంలో ఊరేగింపు ఉదయం 5:30 నుండి రాత్రి 7 గంటల వరకు స్వామివారు దర్శనమిస్తారని తెలిపారు. పుర వీధులలో హారతి పాయింట్లలో మాత్రమే హారతి ఇవ్వబడుతుందని తెలిపారు. కొబ్బరికాయలు కొట్టబడవు అని తెలిపారు. ఏడు వాహనాలకు ఉభయ దాతలు ఉన్నారని, వారికి ఆలయ కమిటీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలను తెలియజేశారు. రథోత్సవ వేడుకలకు అధిక సంఖ్యలో భక్తాదులు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

19 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు..

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని కొత్తపేటలో గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ, అర్చకులు తెలిపారు. ఆలయ కమిటీ దత్త శివ, మెటికల కుళ్లాయప్ప, శంకర సంజీవులు, సాగా సురేష్‌లు తెలిపారు. పూలమాలలతో చక్కటి అలంకరణ, అనంతరం పంచామృత అభిషేకాలు నిర్వహిస్తారని తెలిపారు. తదుపరి ప్రత్యేక పల్లకిలో స్వామి వారిని ఆశీర్వదించి పట్టణ పురవీధుల్లో భక్తుల దర్శనం కొరకు ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. 19వ తేదీ నుండి 23వ తేదీ వరకు శ్రీవారి వార్షిక బ్రహ్మెూత్సవాలను దాతలు, కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బిల్లే నాగప్ప, రంగా శ్రీనివాసులు, గుద్దిటి రామాంజి, పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

టీడీపీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన నారా భువనేశ్వరి

విశాలాంధ్ర-గుడిబండ: గుడిబండ మండలంలోని దిన్నెహట్టి గ్రామంలో టీడీపీ కార్యకర్త ముత్తప్ప కుటుంబాన్ని నారా భువనేశ్వరి పరామర్శించారు. టీడీపీ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టును జీర్ణించుకోలేక మరణించిన ముత్తప్ప కుటుంబాన్ని పరామర్శించి ఆమె మాట్లాడుతూ పార్టీ మీ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. రూ. 3 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. మాజీ మంత్రి పరిటాల సునీత, జిల్లా అధ్యక్షుడు బి.కె పార్థసారథి, రాష్ట్ర తెదేపా ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర తెదేపా కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మండలాధ్యక్షుడు మద్దనకుంటప్ప పాల్గొన్నారు.

నారా భువనేశ్వరికి ఘనంగా వీడ్కోలు

భువనేసరికి బొకేలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-పుట్టపర్తి : సత్యసాయి జిల్లాలో మూడు రోజులు పర్యటన ముగిం చుకొని గన్నవనా నికి బయలు దేరిన భువనే శ్వర్‌కి తెలుగు తమ్ముళ్లు ఘనంగా వీడ్కోలు పలి కారు. గురువారం సత్యసాయి విమానాశ్రయంలో నుంచి ప్రత్యేక విమానంలో గన్నవారానికి బయలుదేరివెళ్లారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు అక్రమ అరెస్టుతో మనస్థాపానికి గురి చెంది మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలను ఆమె పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. పుట్టపర్తి, ఒడిసి, కదిరి, రామగిరి, రాప్తాడు, ధర్మవరం, మడకశిర మండలాలలో పర్యటించారు. తన పర్యటనకు సహకరించిన మాజీ మంత్రులు పల్లె రఘునాథ్ రెడ్డి, పరిటాల సునీతతో పాటు జిల్లా అధ్యక్షుడు బికే పార్థసారథి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎంపీ నిమ్మల కృష్ణప్పతో పాటు టీడీపీ నాయకులు కార్యకర్తలు సహకరించిన వారందరికీ భువనేశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. వీడ్కోలు పలికిన వారిలో పల్లె రఘునాథ్ రెడ్డి, పరిటాల సునీత, బి.కె పార్థసారథితో పాటు టీడీపీ నాయకులు పెనుగొండ సబితమ్మ, బండారు శ్రావణి, సామకోటి ఆదినారాయణ, జయప్రకాష్, శుభ చంద్ర, బొమ్మయ్య, శ్రీరామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి టీడీపీ ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్నా

డీఎస్పీ వేణుగోపాల్..

విశాలాంధ్ర-అమడగూరు: మండలంలోని పలు గ్రామాల్లో డీఎస్పీ వేణుగోపాల్ గురువారం పర్యటించి పలువురు టీడీపీ నాయకులు, మండల ప్రజలతో ఆత్మీయ పరిచయం చేసుకున్నారు. సార్వత్రిక ఎన్నికలలో పుట్టపర్తి నియోజకవర్గం తెలుగుదేశం, జనసేన పొత్తుతో నాకు ఎమ్ఎల్ఏ టికెట్ అధిష్టానం కేటాయిస్తే మీరంతా సహాయ సహకారాలు అందించాలని , మీ కుటుంబ సభ్యునిగా కులాలకు అతీతంగా నన్ను దీవించాలని కోరారు. కార్యక్రమంలో వలిపి అంగడి అమర, పల్లపు తిరుపతయ్య,కొత్తచెరువు కుంచెపు పెద్దన్న,రఘువరన్ యాదవ్,తలమర్ల టైలర్ రమణ,కదిరి వెంకట్,కమ్మవారిపల్లి మదన్మోహన్, రామసాగరం ఆది, గాజులపల్లి సూరి పాల్గొన్నారు.

అడ్డుకున్న టీడీపీ నాయకులు కార్యకర్తలు..

విశాలాంధ్ర-అమడగూరు: డీఎస్పీ వేణుగోపాల్ పర్యటనను టీడీపీ అడ్డుకున్న మండల నాయకులు కార్యకర్తలు, గురువారం మండల స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నాయకులు విలేకరులతో మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ఆదేశించకుండానే నియోజవర్గం ఇంచార్జ్ అనుమతి లేకుండానే గ్రామాలలో పర్యటిస్తూ టికెట్ నాకే వస్తుందంటూ ప్రజలను మభ్యపెడుతూ వడ్డెర కులస్తులకే పార్టీ టికెట్ కేటాయిస్తున్నామని కుల రాజకీయాలకు తెర లేపుతున్నారని, అలాంటి వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని ఎక్కడ కూడా తిరగనివ్వం అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

అమర జవానులకు ఘన నివాళులు

విశాలాంధ్ర-ధర్మవరం: ఐదేళ్ల కిందట ఫిబ్రవరి 14న జమ్మూ నుంచి శ్రీనగర్ కు వెళుండగా పుల్వామాలో సైనిక వాహన శ్రేణిపై పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాదులు ఆత్మాహుతికి దాడికి పాల్పడిన ఘటనలో 40 మంది సైనికులు మృతి చెందారు. నేటికీ ఒక సంవత్సరం పూర్తి కావడంతో, పట్టణంలోని ఆదర్శ పార్కులో అమరులైన వారికి ఆదర్శ సేవా సంఘం సభ్యులు ఘన నివాళులు తెలిపారు. చిన్న ప్రకాష్ బిమిశెట్టి కృష్ణమూర్తి, గుద్దిటి నాగార్జున, అడ్వకేట్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ దేశం కోసం జవానులు ప్రాణాలు అర్పించడం దేశం గర్వించదగ్గ విషయమని, ఉగ్రవాదుల ఆత్మహుతి దాడిలో సైనికులు మృతి చెందడం ఆ కుటుం బాలు శోకసముద్రంలో మునిగాయన్నారు. ప్రతి ఒక్కరూ దేశం నాకేమీ ఇచ్చింది అని అనకుండా-దేశం కోసం తాను ఏమి చేశాను అన్న ఆలోచనతో ముందుకు వెళితే దేశం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. ఆత్మహుతి దాడి ప్రజల హృదయా లను కన్నీటి పర్యంతం చేశాయని తెలిపారు. కొవ్వొత్తులతో సంతాప నివాళులను తెలియజేశారు. కార్యక్రమంలో దాసరి శ్రీరాములు, పవన్ కుమార్, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగస్తులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో ఆర్టీసీ కార్మికుల నిరసన

విశాలాంధ్ర-ధర్మవరం: ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తూ గేట్ ధర్నా నిర్వహించారు. జోనల్ వైస్ ప్రెసిడెంట్ వైజెపి. కుమార్ డిపో అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్, మధు మాట్లాడుతూ జేఏసీలో భాగంగా ఎన్ఎంయుఏ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు 15, 16వ తేదీల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. మిగిలిన ఉద్యోగ సంఘాలతో కలిసి టీ విరామ సమయంలో గేట్ ధర్నా కూడా నిర్వహించామని తెలిపారు. గతంలో ఆర్టీసీలో ఇచ్చిన విధంగానే అన్ని కేటగిరీల ఉద్యోగులకు 2011 నారమ్స్ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని, పనిష్మెంట్లను అడ్డంకింగా చూపి ప్రమోషన్లను నిరాకించరాదని తెలిపారు. 2016కు ముందు మృతి చెందిన ఉద్యోగుల వారసులకు కూడా ఆర్టీసీ సర్వీసు రూల్స్ ప్రకారం కారుణ్య నియామకాలు జరిపి, ఉద్యోగ భృతిని తప్పక కలిగించాలని డిమాండ్ చేశారు కొత్త బస్సులను కొనే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈనెల 17న తాలూకా కేంద్రాల్లో ర్యాలీ, ధర్నా నిర్వహణ, 20వ తేదీన కలెక్టరేట్ల వద్ద ర్యాలీ, ధర్నా, ఈనెల 21 నుండి 24వ తేదీ వరకు జిల్లా కేంద్రాల పర్యటనలు, 27వ తేదీన సమస్యల పరిష్కారంపై చలో విజయవాడ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మహిళా భివృద్ధిలో ఏపీ దేశానికే ఆదర్శం..

విశాలాంధ్ర–డి.హీరేహాళ్: మహిళల అభివృద్ధితోనే దేశానికి ఆదర్శమని మాజీ ఏపిఐఐసి ఛైర్మెన్, నియోజకవర్గం సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ హైస్కూల్ మైదానంలో ఐకెపి (వెలుగు సిబ్బంది) ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా మెప్మా మహిళలకు, అక్కాచెల్లెమ్మలకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నాల్గవ విడత "వైయస్సార్ ఆసరా" నిధులకు సంబంధించి మెగా చెక్కును ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, మాజీ ఏపిఐఐసి ఛైర్మెన్ మెట్టు గోవిందరెడ్డిలు మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళాభివృద్ధిలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ఏపీ లో తెలుగుదేశం ఇతర ప్రతిపక్షాలతో పాటు ఎల్లో మీడియా నిత్యం ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేయాలని సీఎం జగన్మోహన్ రెడ్డి

చెక్కులు పంపిణీ చేస్తున్న మెట్టు గోవిందరెడ్డి

ఎంతో పారదర్శకంగా నేరుగా వారి అకౌంట్లోకి నగదును బదిలీ చేస్తుంటే చూసి ఓర్చుకోలేని వారు రాష్ట్రంలో అభివృద్ధి లేదు అంటూ మొదలు పెట్టడం సిగ్గుచేటని మండిపడ్డారు. అధికార కోసం చంద్రబాబులాగా జగన్మోహన్ రెడ్డి ప్రజలను మోసం చేయలేదని, ఎన్ని కష్టాలు ఉన్నా ఇచ్చిన మాట కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. మండలంలో 718 మహిళా సంఘం గ్రూపులకు, 7039 అక్కచెల్లెమ్మలకు నాలుగో ఏడాది కూడా డ్వాక్రా రుణమాఫీకి రూ. 5 కోట్లు09 లక్షల రూపాయలను మహిళల ఖాతాల్లో ఒక్క రుణమాఫీకే జమ అయిందన్నారు. అక్కచెల్లెమ్మలను మహారాణులుగా చేయడమే జగనన్నలక్ష్యం అని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో మరో సారి జగన్మోహన రెడ్డి ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా మహిళలు 'ముందుకు సాగాలని, జగన్మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ భోజరాజ్ నాయక్, డి. హీరేహాళ్ మండల కన్వీనర్ వన్నూరుస్వామి, జడ్పీటీసీ హసీనా భాను, ఎంపీపీ పవిత్ర, రాళ్ల తిమ్మారెడ్డి, మైనారిటీ నాయకులు హాజీ రహంతుల్లా, గంగాధర్, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు, మండల వైఎస్ఆర్సిపి కుటుంబ సభ్యులు మరియు ప్రజలు మహిళలు పాల్గొన్నారు.

మట్టి బొమ్మల తయారీలో ప్రథమ బహుమతి

విశాలాంధ్ర–శింగనమల: అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరిగిన నాలుగో సంవత్సరం అనంత బాలోత్సవం కార్యక్రమానికి జిల్లా నలు మూలల నుండి స్కూల్ విద్యార్థిని విద్యార్థులు వేల సంఖ్యలో హాజరయ్యారు, అనంత బాలో త్సవం విద్యార్థినీ విద్యార్థులలోదాగి ఉన్న ప్రతిభ తో పాటు సృజ నాత్మకతను వెలికి తీయడానికి అనంత బాలచం ఎంతగానో ఉపయోగకారిగా ఉంటుందన్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల పిల్లలను పోటీతత్వం ఏర్పడుతుందన్నారు, అనంత బారోత్సవం కార్యక్రమంలో శింగనమల మండలం శోదన పల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ లో తొమ్మిదవ తరగతి చదువుతున్న పేట కిరణ్ కు మార్ అనే విద్యార్థి మట్టి బొమ్మల తయారీలో మొదటి బహుమతి సాధించాడు. కిరణ్‌కుమార్ నిరుపేద కుటుంబంలో పుట్టి మట్టి బొమ్మల తయారు చేయడంలో ప్రతిభను కనబరచడంతో పాటు కష్టపడి చదువుతూ తన స్కూలుకు మంచిపేరు తేవడం సంతోషకరమని శోధనపల్లి జెడ్పీహెచ్ స్కూలు ఉపాధ్యాయులు అభినందించారు మూడ్రోజుల ముందు చిత్రలేఖనంలో ప్రథమ బహుమతి సాధించడం సంతోషకరంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు.

చిన్నపాటి సమస్యకే షోకాజ్ నోటీసులా!

విశాలాంధ్ర–ఎన్‌పికుంట: జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి హెచ్‌ఎం తో పాటు నలుగురు ఉపాధ్యాయులకు తాఖీదులు ఇవ్వడాన్ని రాష్ట్రోపాధ్యాయ సంఘం పక్షాన జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరి ప్రసాద్ రెడ్డి, చంద్రశేఖర్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖధికారి పాఠశాలను తనిఖీ చేసిన సమయంలో చిన్న సమస్యల ను భూతద్దంలో చూపి షోకాజు నోటీసులు ఇవ్వడం అన్యాయమన్నారు. ఉపాధ్యాయులు తీవ్రమైన పని ఒత్తిడిలో మానసికంగా కృంగిపోతున్న వేళ షోకాజులిచ్చి వారిని భయభ్రాంతులకు గురిచేయడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణం తాఖీదులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర–పెనుకొండ: పెనుకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు జన్మదిన వేడుకలను గురువారం న్యాయవాదుల విశ్రాంతి భవనంలో న్యాయవాదులు నాగరాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతూ రాబోయే కాలంలో మంచి భవిష్యత్తు పొందాలని ఉన్నత స్థానాలకు ఎదగాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో న్యాయవాదుల శివశర్మ, విక్రంత్ నాయక్, రమ పావని, నాగిరెడ్డి, శ్రీనివాసులు, నాగేశ్వరి, లక్ష్మీనారాయణ, మోహన్ నాయక్, బాలాజీ, హరీష్, జావిద్ పాల్గొన్నారు.

ఎన్నికల ముందే జాబ్ నోటిఫికేషన్లా..!

విశాలాంధ్ర– పుట్లూరు: పుట్లూరు మండలంలో ఒక నిరుద్యోగి సోషల్ మీడియా ద్వారా తన ఆవేదన పరిచారు. ఎన్నికల ముందు మాత్రమే ప్రభుత్వాలు జాబ్ నోటిఫికేషన్ రిలీజ్ చేస్తారని, భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ముందే గ్రహించి ఉండే ఎన్నికలు 5సం" ఒకసారి కాకుండా ఏడాదికి ఒకసారి ఎన్నికలు నిర్వహించాలని రాజ్యాంగం వ్రాసే వారేమోనని మనసులోని ఆవేదనను వ్యక్తం చేశారు

70 మంది జనసేన పార్టీలో చేరిక

విశాలాంధ్ర–ఉరవకొండ: ఉరవకొండ జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గౌతం కుమార్ ఆధ్వర్యంలో గురువారం నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 70 మంది యువకులు జనసేన పార్టీలో చేరారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు పవన్ కుమార్ నాయకత్వ లక్షణాలకు ఆకర్షితులై తాము పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు చంద్రశేఖర్, కేశవ రాజేష్, హరి శంకర్ నాయక్, సూర్యనాయక్, మణికుమార్ పాల్గొన్నారు.

ఆర్డీటీ ఆధ్వర్యంలో దాణా పంపిణీ

విశాలాంధ్ర–గుడిబండ: చిగతుర్పి,బైరేపల్లి కల్లురొప్పం గ్రామాలలో ఆర్డిటి సంస్థ ఎకాలజీ విభాగం ఆధ్వర్యంలో పాడి రైతులకు దాణా ను పంపిణీ చేశారు. ఆర్డిటి ఎస్టీఓ రమణ మాట్లాడుతూ గుడిబండ మండలంలోని మహిళా రైతులకు 60 శాతం సబ్సిడీ ధరతో ఒక మహిళా రైతుకు 8 దాణా బస్తాల చొప్పున పంపిణీ చేశామని, మండల వ్యాప్తంగా మహిళా రైతులకు సబ్సిడీ ధరతో అందించిన గేదె,ఆవులకు భైరేపల్లి 208 ,కల్లురొప్పం176,చిగతుర్పి120, గ్రామాలలోని రైతులకు మొత్తం 63 మంది రైతులకు 504 బస్తాల దాణాను పంపిణీ చేశామని తెలిపారు ఆర్‌డిటి సహకారంతో స్త్రీలు పురుషులతో సమానంగా ఆదాయాన్ని సంపాదిస్తూ కుటుంబం అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు పాడి మహిళ రైతులు, సర్పంచులు, ఆర్‌డిటి సి డి సి మెంబర్లు పాల్గొన్నారు.

గుండుమలకు ఎంపీ టికెట్ ఇవ్వండి



విశాలాంధ్ర–రొళ్ల: హిందూపురం ఎంపీ టికెట్ ను మాజీ ఎమ్మెల్సీ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామికి కేటాయించాలని రోళ్ళ మండలంలోని రొళ్ల పంచాయితీ తెలుగుదేశం పార్టీ నాయకులు కోరుతున్నారు. మడకశిర నియోజకవర్గానికి ఇంతవరకు పార్లమెంట్ టికెట్ కేటాయించలేదని, ఈసారి ఎంపీ టికెట్ ను మడకశిర నియోజక వర్గానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. గుండుమల తిప్పేస్వామి హ్యాట్రిక్ ఎమ్మెల్సీ, చైర్మన్‌గా అసెంబ్లీ బీసీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ గా వివిధ రూపంలో ప్రజలకు సేవలు అందించారని, హిందూపూర్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పోతున్నారని, ఆయనకు టికెట్ కేటాయిస్తే టీడీపీ 2024 ఎన్నికల్లో టీడీపీ జెండా ఎగరవేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ అధ్యక్షుడు మారన్న, రమేష్, దానప్ప, నాగేంద్ర, తెలుగు యువత తాలూకా ఉపాధ్యక్షుడు మూర్తి, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ మూర్తి, కిరణ్, వాల్మీకి టీఎన్ఎస్ఎఫ్ తాలూకా కార్యదర్శి నగేష్, వార్డ్ మెంబర్ ప్రకాష్, వార్డ్ మెంబర్ నాగరాజు పాల్గొన్నారు.

వృక్ష సంపదను కాపాడుకుందాం..

విశాలాంధ్ర–జెఎన్టియుపి: ప్రకృతి విపత్తులు, పర్యావరణ పరిరక్షణలో వృక్ష సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఉపకులపతి ఆచార్య జి.వి.యస్. శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం అనంతపురం జెఎన్టియు ఇంజనీరింగ్ కళాశాలలోని హంపి వసతి గృహం ఆవరణలో ఉపకులపతి, రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్ , కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య యస్.వి.సత్యనారాయణ మొక్కలను నాటారు. ఆరోగ్య సంరక్షణ, ప్రకృతి ఎన్నో రుగ్మతుల నుండి నివారణకు మార్గాలను చూపగలిగేది మొక్కలే అని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య ఇ.అరుణ కాంతి, ఆచార్య టి.బాల నరసయ్య, ఆచార్య కె.మాధవి, దాయం.రామ శేఖర రెడ్డి పాల్గొన్నారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్టు

విశాలాంధ్ర–శింగనమల: అనంతపురం జిల్లా ఎస్పీ ఆదేశాలతో కోడి పందేలు ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుండి రూ. 70,470ల నగదు, 2 పందెం కోళ్లు, ఒక కారు, 7 ద్విచక్ర వాహనాలు, 7 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. శింగనమల ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది, స్పెషల్ బ్రాంచి పోలీసులు నిదనవాడ గ్రామ శివార్లలో కోడి పందేల స్థావరంపై దాడులు చేశారు.

సాయిబాబా వార్షికోత్సవ పూజలు

విశాలాంధ్ర–రాప్తాడు: మండల కేంద్రం బీసీ కాలనీలో ఉన్న దేవాలయంలో వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఉదయాన్నే స్వామి వారిని పుష్పాలతో అలంకరించి అభిషేకాలు అర్చకులు చేశారు. ఉదయం నుంచి భక్తులు పెద్దవిత్ర హాజరై స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు భక్తులకు ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గ్రంథాలయంను అకస్మిక తనిఖీ

విశాలాంధ్ర–పుట్లూరు: పుట్లూరు శాఖా గ్రంథాలయాన్ని అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమా అకస్మిక పలు రికార్డులు పరిశీలించి గ్రంథాలయ పన్ను వసూలుకు కృషి చేయాలని తెలిపారు. అనంతరం గ్రంథాలయం పనితీరును అందుబాటులో ఉన్న పుస్తకరాలు తదితర సౌకర్యాలను పాఠకులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.జయరాములు పాల్గొన్నారు.

హెచ్ఎంఐఎస్ నోడల్ అధికారుల సమీక్ష

విశాలాంధ్ర–అనంతపురం వైద్యం: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సమావేశ భవనంలో హెచ్ ఎంఐఎస్ నోడల్ అధికారుల సమీక్ష సమావేశం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈ బి దేవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ ఐ ఎం ఎస్ పోర్టల్ నందు నిర్వహించే అన్ని ఆరోగ్య కార్యక్రమాల వివరాలు సకాలంలో పొందుపరచాలని సూచించారు. ఓపి సేవలు లేబరేటరీ పరీక్షలు బాలింత సేవలు వ్యాధి నిరోధక టీకాల సేవలు, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల పంపిణీ, ఇతర అన్ని ఆరోగ్య కార్యక్రమాల సేవలను పోర్టల్‌లో పొందుపరచాలని తెలిపారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ.. మార్చి మూడవ తేదీన మొదలయ్యే పల్స్ పోలియో టీకా చుక్కల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఓ మహమ్మద్ రఫీ, డిప్యూటీ ఎస్ ఓ గౌడ్, నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యమే లక్ష్యం.. మంత్రి ఉషాశ్రీ

విశాలాంధ్ర–రొద్దం: మండలంలోని రెడ్డిపల్లి మరియు తుర కలా పట్నం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లీనిక్ భవనాలను గురువారం రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషాశ్రీచరణ్ ప్రారంభించారు. గ్రామ స్వరాజ్యం సుపరిపాలన కోసం జగనన్న గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి అవినీతికి తావు లేకుండా అందరికీ ప్రభుత్వ సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు చంద్రశేఖర్, జెడ్పిటీసీ పద్మ ఆక్కులప్ప, రెడ్డిపల్లి సర్పంచ్ శాంతమ్మ వైస్ ఎంపీపీ రత్నమ్మ తురకల పట్నం సర్పంచ్ లక్ష్మీదేవి సింగల్ విండో అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

విశాలాంధ్ర–పెనుకొండ: స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్2 ఏడు రోజులుగా మహదేవపల్లిలో నిర్వహించిన ప్రత్యేక శిబిరం గురువారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డా.కేశవరావు హాజరై మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు తమ తమ పనులను స్వయంగా చేసుకుంటూ తోటి వారికి సహాయపడాలన్నారు. గ్రామంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గత ఏడు రోజులుగా చేపట్టిన కార్యక్రమాలను అభినందించారు. స్థానిక కౌన్సిలర్ రామాంజనేయులు ప్రసంగిస్తూ దశాబ్ద కాలం తర్వాత మా గ్రామంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని దానికి గాను గ్రామ ప్రజల తరఫున కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ పి. ఓ. డా. జయప్ప ప్రసంగిస్తూ ఏడు రోజులు పాటుగా గ్రామ ప్రజలు అందించిన సహకారం మరువలేనిదని అన్నారు. కార్యక్రమం ఎంతో ఉపయోగపడిందని విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పి.ఓలు కాంతారావు, రంగనాయకులు, అధ్యాపకులు విష్ణువర్ధన్, చంద్రశేఖర్, ఫర్నాజ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని అధిక మెజార్టీతో గెలిపించండి

విశాలాంధ్ర–నల్లమాడ: 2024లో సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సతీమణి దుద్దుకుంట అపర్ణ పిలుపు నిచ్చారు. శుక్రవారం మండలంలోని కొండకింద తండా, వేళ్లమద్ది ,కొత్తపల్లితండా గ్రామాలలో ఎన్నికల ప్రచారం రెండోరోజు నిర్వహిం చారు. ఇంటింటికీ తిరిగి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి నియోజక వర్గంలో చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిం చారు. అత్యధిక మెజారిటీతో గెలిపించి రెండవసారి జగనన్నను సీఎంను చేసి శ్రీధర్‌రెడ్డిని రెండవసారి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే సంక్షే మానికి అడ్డంకి ఉండదని పేర్కొన్నారు.

తలుపుల ఎస్ఐగా దిలీప్‌కుమార్ ..

విశాలాంధ్ర–తలుపుల: స్థానిక పోలీస్‌స్టేషన్లో నూతన ఎస్ఐగా దిలీప్‌కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామని, గుట్కా, గంజాయి, అక్రమ మద్యం, రవాణా అరికట్టడం సమూలంగా నిర్మూలించ దానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రణాళికా బద్ధంగా పనిచేస్తానని తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలి

విశాలాంధ్ర–కదిరి: ఆచార్య ఎన్జీ రంగా యూనివర్సిటీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ ఆప్కాస్‌లో చేర్చాలని గురువారం వ్యవసాయ పరిశోధన కేంద్రం కాంట్రాక్ట్ వర్కర్స్ యూని యన్ సిఐటియు ఆధ్వర్యంలో ప్రధాన శాస్త్రవేత్త సంపత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ నాయకులు పద్మావతి, ఫాతిమా, మంజుల, ప్రమీల, సరస్వతి, సీఐటీయూ నాయకులు జగన్మోహన్, రామ్మోహన్,గంగప్ప పాల్గొ న్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వేతనంతో కూడిన సెలవులు అమలుచేయాలని, పని ప్రదేశంలో కార్మికులు ప్రమాదాల గురైన ప్పుడు వైద్యం చేయించాలని డిమాండ్ చేశారు.

ఇల్ల స్థలాల్లో ముళ్లకంపలు తొలగింపు

విశాలాంధ్ర–తాడిపత్రి: మండలంలోని అక్కన్న పల్లి గ్రామ పంచాయతీలో గురువారము సిపిఐ మండల కార్యదర్శి నాగరంగయ్య ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాలలో ఉన్న ముళ్ళ కంపలు తొలగించే కార్యక్రమం చేశారు. ముఖ్య అతిథిగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టి. రంగయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 94 మంది కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకున్న భాదితులకు ప్రభుత్వం ఇంటి స్థలాలు ఇచ్చింది. కానీ ఇంతవరకు మౌలిక వసతులు లేక ఇంటి నిర్మాణం చేసుకోలేకపోయారు. దీంతో బుధవారం సిపిఐ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇంటి స్థలాల్లో మౌలిక వస తులు కల్పించాలని లబ్ధిదారులతో కలిసి తాసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తాసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఎ.నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.టి.రామాంజినేయులు లబ్ధిదారులు రామలక్ష్మి, వరాలు, మంగమ్మ, జయమ్మ, ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఏఈ నిర్లక్ష్యంపై ఆగ్రహించిన ప్రజాప్రతినిధులు

విశాలాంధ్ర–ఉరవకొండ: ఉరవకొండ మండల విద్యుత్ శాఖ ఏఈ గురుమూర్తి విధులు పట్ల వ్యవహరిస్తున్న నిర్లక్ష్యంపై ప్రజా ప్రతినిధులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉరవకొండ మండల ప్రజా పరిషత్తు సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ నరసింహులు అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీపీ నరసింహులు, వైస్ ఎంపీపీ శ్రీనాథ్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు చంద్రమ్మ విద్యుత్ సమస్యలను మాట్లాడారు, రాకెట్ల తండా, రాకెట్ల, ఆమిద్యాల గ్రామాలలో ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోయి నెలలు గడుస్తున్నా ఎందుకు మరమ్మత్తులు చేయడం లేదన్నారు. ఉరవకొండతో పాటు అనేక గ్రామాల్లో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేయాలని గత సమావేశంలో కూడా సూచించినప్పటికీ ఏ ఈ ఒక్క పని చేయడం లేదని సభ్యులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు కింద పడే ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ ఏఈ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఏఈపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉరవకొండ పట్టణంతో పాటు వివిధ గ్రామాల్లో నెలకొన్న తాగునీరు సమస్యపై కూడా సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సబ్సిడీ బియ్యం సకాలంలో లబ్ధిదారులకు అందక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఎంపీపీ నరసింహులు మాట్లాడుతూ అధికారులు తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ శ్రీనాథ్ రెడ్డి, ఎంపీడీవో అమృత రాజు, తాసిల్దార్ శ్రీనివాసులు ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

18న సిద్ధం సభకు సన్నద్ధం కావాలి

విశాలాంధ్ర–ఎన్ పికుంట: ఎన్నికల సమర శంఖారావంలో భాగంగా ఈనెల 18 ఆదివారం రాప్తాడు ఆటోనగర్ లో జరగనున్న సిద్ధం బహిరంగ సభకు మండలంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ సమర్థం కావాలని కదిరి వైఎస్ఆర్‌సీపీ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని శివాలయం ప్రాంగణంలో వైసీపీ కార్యకర్తల సమావేశాన్ని మండల కన్వీనర్ కొత్త రంగారెడ్డి అధ్యక్షత నిర్వహించగా, ముఖ్యఅతిథి మక్బూల్ అహ్మద్ రాయలసీమలోని ప్రతి నియోజకవర్గం నుంచి వైసీపీ కార్యకర్తలు, నాయకులు తరలివస్తారని, రవాణా సౌకర్యం కోసం ప్రతి గ్రామం నుంచి ప్రత్యేకంగా బస్సులు, కార్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో నాయకులు పూల శ్రీనివాసులు రెడ్డి, వజ్ర భాస్కర్‌రెడ్డి, బత్తల వెంకటరమణ, జు కొత్త రంగారెడ్డి, బాలకృష్ణ నాయుడు, జగదీశ్వర రెడ్డి, ఎంపీటీసీ తిమ్మారెడ్డి, సర్పంచులు నాగమణిస్వర నాయుడు, పాల్గొన్నారు.

సీటీ గైడెడ్ లంగ్ బయాప్సీ విజయవంతం

విశాలాంధ్ర–అనంతపురం వైద్యం: స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సీటీ గైడెడ్ లంగ్ బయాప్సీ విజయవంతం అయ్యింది. స్థానికంగా నివాసం ఉంటున్న సుధాకర్(60) కాన్సర్‌తో బాధపడుతూ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వచ్చారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపర్డెంట్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు క్యాన్సర్ చికిత్సలో కణితి నిర్ధారక పరీక్ష ఎంతో ముఖ్యమైనది భావించి అల్ట్రా సౌండ్ మరియు సిటీ స్కాన్ పరీక్షలలో కణితి ఉన్న అవయవాన్ని బట్టి ఏ విధానంలో చేయవలెను నిర్ధారించుకున్నారు. గురువారం జిజి హెచ్, అనంతపురంలో మొట్ట మొదటిసారిగా సీటీ గైడెడ్ లంగ్ బయాప్సీ చేశారు. ఆ రోగికి కుడి ఊపిరితిత్తులలో ఒక క్యాన్సర్ కణితిని గుర్తించిన తర్వాత నిర్ధారణ కొరకు బయాప్సీ(ముక్క పరీక్ష) చేశారు. ఈ పరీక్షకు రూ. 15 వేలు ఖర్చు అయ్యే పరీక్షా ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించామన్నారు. అత్యంత క్లిష్టమైన ప్రొసీజర్ అయిన ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసినందుకు ఆనందంగా ఉంది అన్నారు. వైద్య బృందానికి వైద్యాధికారులకు డా.సురేష్, ప్రొఫెసర్, హెచ్ ఓ డి అఫ్ రడీయాలజీ అడిషనల్.డి ఎం ఈ /ప్రిన్సిపాల్ – డా .జి .మాణిక్యం రావు, అభినందనలు తెలియజేశారు.

హై స్కూల్‌లో వసతులు కల్పించండి

విశాలాంధ్ర–తాడిపత్రి: పెద్దపప్పూరు మండలం పెద్దపప్పూరు గ్రామంలో ఉన్న హైస్కూల్‌కు మౌలిక వసతులు కల్పించాలని జై భీమ్ రావు భారత్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వీర నాగరాజు, మైనార్టీ నియోజకవర్గం అధ్యక్షులు హబీబ్ పేర్కొన్నారు. గురువారం వీరు ఇరువురు హైస్కూల్‌ను పరిశీలించి మాట్లాడుతూ హైస్కూల్ కాంపౌండ్ వాల్ పడిపోయిందన్నారు. నాడు..నేడు కింద మంజూరైన రూమ్‌ల నిర్మాణం ఆగిపోయిందన్నారు. విద్యా ర్థులు త్రాగునీరు త్రాగడానికి మినరల్ వాటర్ ప్లాంట్ మరమ్మత్తులు పనిచేయకుండా మూలన పడిందన్నారు. మధ్యాహ్నం భోజనం కింద విద్యార్థుల కోసం వంట చేయడానికి ఆరు బయటనే చేస్తున్నారన్నారు. వంట చేసే సమయంలో దుమ్ము, ధూళి పడి విద్యార్థులు అనారోగ్య బారిన పడుతున్నారన్నారు. అలాగే హైస్కూల్లో దాదాపు 500 మంది విద్యార్థులు, 21 మంది టీచర్లకు అరకొర బాత్రూంలు ఉన్నాయి. మగ విద్యార్థులు మాత్రం స్కూల్ బయటికి మూత్ర విసర్జన తదితర విషయాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఎలాంటి స్పందన లేదు. ఇప్పటికైనా హై స్కూల్ సమస్యలపై అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

తనకల్లు ఎస్సైగా ధరణి బాబు

విశాలాంధ్ర–తనకల్లు: తనకల్లు మండలం నూతన ఎస్సైగా ధరణిబాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. మండలంలో అసాంఘిక కార్యకలాపా లకు అరికట్టడంతో పాటు సమూలంగా నిర్మూలించడానికి ప్రత్యేక చర్యల చేపడతామన్నారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగే విధంగా కృషి చేస్తామన్నారు.

యువతా మేలుకో.. ఓటే వజ్రాయుధం..

టీడీపీ రాష్ట్ర ఎస్ఎస్ఎల్ అధ్యక్షుడు ఎమ్మెస్ రాజు

విశాలాంధ్ర–జెఎన్టియుపి: యువత మేలుకు ఓటు వజ్రాయుధం అని టీడీపీ రాష్ట్ర ఎస్ఎస్ఎల్ అధ్యక్షుడు ఎమ్మెస్ రాజు, అనంతపురం జిల్లా టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుత్తా ధనంజయ నాయుడు పేర్కొన్నారు. గురువారం పివికె ఇంజనీరింగ్ కళాశాలలో మై ఫస్ట్ ఓటు ఫర్ సిబిఎన్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రం నేడు ఆర్థిక సంక్షోభం, ప్రజాస్వామ్య అగాధం, నిరుద్యోగం, సహజ సంపదలను దోపిడీ చేస్తున్నారు. టీడీపీ వస్తే నిరుద్యోగ యువతకు ఉపాధి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు నిస్వార్థ సేవ స్ఫూర్తి చంద్రబాబు అని అన్నారు.